సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

చెక్కు అందజేస్తున్న రాష్ట్ర శాసనమండలి ప్రతి పక్షనేత సిరికొండ మధుసూదనాచారి

చిలిపిచెడ్, మార్చి 5 : ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదని రాష్ట్ర శాసనమండలి ప్రతి పక్షనేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన క్యాంప్ కార్యాయలంలో చిలిపిచెడ్ మండలం అంతారం గ్రామాలకు చెందిన మోతె సుశీల అనారోగ్యంతో చికిత్స పొందారు. వైద్య ఖర్చు ల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.54 వేల చెక్కును బాధితురాలు కుటుంబ సభ్యులకు అందజేశారు.

పాడిపశువులకు వ్యాక్సిన్లు వేయించాలి

పశువైద్యశాలలో వ్యాక్సిన్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

వెల్దుర్తి, మార్చి 5 : పాడిపశువులకు ఎలాంటి వ్యాధులు సోకకుండా ముందస్తు వ్యాక్సిన్లు ఇవ్వాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మాసాయిపేట పశువైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యశాలలో రికార్డులను తనిఖీ చేశారు. పశువైద్యశాలతో పాటు పరిసరాలను పరిశీలించారు. దవాఖానలో రైతులు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని, ఎప్పటికప్పుడు పశువులకు కావాల్సిన మందులను అందుబాటులో ఉంచడంతో పాటు పాడి పశువులకు ముందస్తు వ్యాక్సిన్లు వేయించాలని డాక్టర్ కావ్యకు సూచించారు. కలెక్టర్ వెంట అధికారులు ఉన్నారు.

నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

మాసాయిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వివరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

వెల్దుర్తి, మార్చి 5 : విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మాసాయిపేట ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ పాఠశాలలు అమలు చేస్తున్న ఏఐ విద్యాబోధనను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి బోధనపై విద్యార్థులకు పలు విషయాలను వివరించి, అవగాహన కల్పించారు. పాఠశాలకు వచ్చిన సందర్భంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో సంబంధిత అధికారులకు ఫోన్ చేసిన కలెక్టర్ విద్యుత్ అంతరాయంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ సెంటర్ పరిశీలన..

చిన్నారులకు భోజనాన్ని మెనూప్రకారం అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. పాఠశాల పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి పాఠశాలలో చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని, వంటసామగ్రి, పప్పు దినుసులను పరిశీలించారు. చిన్నారుల తల్లిదండ్రులతో నెలవారీగా సమావేశాలు ఏర్పాటు చేసి పిల్లల వివరాలను ఆరోగ్య స్థితిని వివరించాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ జ్ఞానజ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

కార్మికుల కనీస వేతనాలు అమలు చేయాలి


నర్సాపూర్‌లో సబ్ ఆర్డినేటర్ విమలకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నర్సాపూర్, మార్చి 5 : కార్మికులందరికీ కనీస వేతనం రూ. 26 వేలు నిర్ణయించి అమలు చేయాలని, 73 షెడ్యూల్ పరిశ్రమ జీవోలను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లోని ఏఎల్‌వో కార్యాలయంలోని సబ్ ఆర్డినేటర్ విమలకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మికుల అవసరాలు, కొనుగోలు శక్తి పెరగాలంటే 73 షెడ్యూల్ పరిశ్రమ జీవోలను సవరించి కార్మికులకు నేటి పరిస్థితులకు అనుగుణంగా మార్చాలని డిమాండ్ చేశారు. లేదంటే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు నాగభూషణం, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి కరుణాకర్

అల్లాదుర్గం,మార్చి 5 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి కరుణాకర్ సూచించారు. బుధవారం అల్లాదుర్గంలోని కేజీబీవీ, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. వంటశాలలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఎంపీఈవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ ఉన్నారు.

జడ్పీహెచ్ఎస్‌ను తనిఖీ చేసిన జిల్లా సివిల్ సప్లై అధికారి

అల్లాదుర్గంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలను జిల్లా సివిల్ సప్లై అధికారి కొమ్మిడి సురేశ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఎంఈవో ధనుంజయ, ఇన్‌చార్జి హెచ్ఎం పిచ్చయ్య, ఉపాధ్యాయులు వీరప్ప ఉన్నారు.

ఉచితంగా ఆర్చరీ, ఫుట్‌బాల్ కోచింగ్

రామాయంపేట, మార్చి 5 : విద్యార్థులు, యువకులకు ఉచితంగా యువ జ్యోతిక్లబ్ ఆధ్వర్యంలో ఆర్చరీ, ఫుట్‌బాల్ కోచింగ్ ఇస్తున్నామని యువజ్యోతి స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు, జిల్లా ఫుట్‌బాల్ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు బొంతల సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం రామాయంపేటలోని కళాశాల ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని కళాశాల ఆవరణలో విలువిద్యతో పాటు ఫుట్‌బాల్‌కు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, రాష్ట్ర స్థాయిల్లో పాల్గొనవచ్చని నిర్వాహకుడు సత్యనారాయణ తెలిపారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాజగోపాల్‌గౌడ్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 5 : రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని వెంటనే అమలు పర్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం రాజగోపాల్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య, బాధ్యులు రాజు, కిష్టయ్య, శివప్రసాద్, అరుణ్, వేణుగోపాల్, సతీశ్ పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

మెదక్ అర్బన్, మార్చి 5 : రాజీమార్గమే రాజమార్గం అనే సూత్రాన్ని అనుసరించి వివాదాలను చక్కదిద్దుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ అవకాశమని బుధవారం ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లాలో వివిధ రకాల రాజీపడదగిన కేసుల్లో ఉన్న కక్షిదారులు రాజీ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 8న నిర్వహించే జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

తూప్రాన్, మార్చి 5 : అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చింత పోచమ్మ (74) మంగళవారం రాత్రి అస్వస్థతకు గురవ్వగా దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పోచమ్మ మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. బుధవారం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం తెలిపారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

- తొలి రోజు ప్రథమ సంవత్సర పరీక్షకు 6,410 మంది విద్యార్థులకు 6,180 మంది హాజరు
- 230 మంది విద్యార్థులు గైర్హాజర్
- జిల్లా వ్యాప్తంగా 30 పరీక్ష కేంద్రాల్లో.. 96.41 శాతం హాజరు
- ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి మాధవి

మెదక్‌లోని పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ల నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 5 : బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 30 పరీక్ష కేంద్రాల్లో ప్రథమ సంవత్సరం పరీక్షకు 6,410 మంది విద్యార్థులకు 6,180 మంది విద్యార్థులు హాజరు కాగా, 230 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి మాధవి తెలిపారు. ఇందులో జనరల్ విభాగంలో 5,780 మంది విద్యార్థులకు 5,575 మంది విద్యార్థులు హాజరు కాగా.. 205 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషన్ విభాగంలో 630 మంది విద్యార్థులకు 605 మంది విద్యార్థులు హాజరు కాగా.. 25 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు 45 నిమిషాల ముందు నుంచే అనుమతించినట్లు వివరించారు. జిల్లాలో ఎక్కడ డిబార్‌కు కానీ, మాల్‌ప్రాక్టిస్‌కు పాల్పడలేదని పరీక్షలు ప్రశాంతంగా జరిగయన్నారు. జిల్లా వ్యాప్తంగా 96.41 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, కేవలం 4 శాతం మంది విద్యార్థులు మాత్రమే హాజరుకాలేదన్నారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించడంతో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడలేదన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్లలోపు గల జిరాక్స్ కేంద్రాలను మూసివేశారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, టీజీఆర్ఎస్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రాహుల్ రాజ్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల పనితీరు, తాగునీటి వసతి తదితర వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట ఇంటల్ నోడల్ అధికారి మాధవి, అధికారులు ఉన్నారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

చేగుంటలో పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు

వెల్దుర్తి పరీక్షా కేంద్రం వద్ద హాల్ టికెట్ల నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

హాల్ టికెట్ లేక విద్యార్థి ఆందోళన

నర్సాపూర్,మార్చి 5 : హాల్‌టికెట్ లేక ఓ ఇంటర్ విద్యార్థి ఆగమాగమైన సంఘటన నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షల్లో నర్సాపూర్ పట్టణంలోని ఎల్లంకి జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న అనిల్ పరీక్షకు ఇంటి నుంచి వచ్చేటప్పుడు తన హాల్‌టికెట్‌ను స్నేహితుడికి ఇచ్చి నేను తర్వాత వస్తాను ముందు నువ్వు వెళ్లు అని అతడిని పంపించాడు. అనిల్ తీరిగ్గా పరీక్షా కేంద్రానికి వచ్చి హాల్‌లోకి వెళ్లగానే ఇన్విజిలేటర్ హాల్‌టికెట్ అడిగే సరికి కంగుతిన్నాడు. హాల్‌టికెట్ లేకపోయేసరికి అతడిని పరీక్ష కేంద్రం నుంచి సిబ్బంది బయటకు పంపించారు. అక్కడున్న సిబ్బంది తన సమస్యను తెలుసుకొని స్నేహితుడిని పరీక్షా కేంద్రం నుంచి బయటకు రప్పించి తన బ్యాగులో నుంచి హాల్‌టికెట్ తీసి ఇవ్వడంతో అనిల్ ఊపిరి పీల్చుకున్నాడు. అనంతరం సిబ్బంది ఇద్దరినీ పరీక్ష హాల్‌లోకి అనుమతినిచ్చారు. పరీక్ష సమయానికి కేవలం 5 నిమిషాల సమయం ఉన్నప్పుడే ఈ తతంగం జరగడంతో అనిల్ పరీక్ష రాయగలిగాడు. హాల్‌టికెట్‌పై ఇంత నిర్లక్ష్యమా అని సిబ్బంది సున్నితంగా మందలించారు.

చందూర్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు మరమ్మతులు చేయాలి

చందూర్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

చిలిపిచెడ్, మార్చి 5 : మండలంలోని చందూర్ గ్రామ శివారులోని మంజీరా నది వద్ద ఉన్న ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు మరమ్మతులు చేయాలని చందూర్, గుజిరి తండా రైతులు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి వినవించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో గుజిరి తండా మాజీ సర్పంచ్ రాకేశ్ నాయక్, చందూర్ నాయకుడు దాసరి శేషాద్రి ఆధ్వర్యంలో రైతులు వినతి పత్రం అందజేశారు. చందూర్, గుజిరి తండాలో భూగర్భ జలాలు పూర్తి అడుగంటిపోయి బోర్లు నీరు పోయలేక వరి, చెరుకు, కూరగాయలు ఎండిపోతున్నాయని రైతులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఎత్తిపోతల ప్రాజెక్టు 800 ఎకరాలకు సాగు కోసం మంజూరు చేసిన ఈ ప్రాజెక్టు వివిధ కారణాల వల్ల మట్టి నిండి మోటర్లు పంపుసెట్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పూర్తి ధ్వంసమయ్యాయని ఎమ్మెల్యేకు వివరించారు. చందూర్, గుజిరి తండా శివారులో భూగర్భ జలాలు పూర్తి అడుగంటిపోవడంతో రైతులు పంటలు ఎండిపోకుండా 720 ఫీట్లు వరకు బోర్లు వేసినా నీరు పడకపోవడంతో అప్పులపాలై పంటలు సాగుచేయలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధ్వంసమైన ఎత్తిపోతలను మరమ్మతులు చేయించే విధంగా అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. మంత్రి ఉత్తమ కుమార్‌రెడ్డి, కలెక్టర్‌కు లేఖ రాసి పంపించినట్లు మాజీ సర్పంచ్ రాకేశ్ నాయక్ తెలిపారు. నర్సింహులు, విష్ణు, శ్రీను, బన్సీలాల్, సర్వన్ నాయక్, పన్యలాల్ ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత

శివ్వంపేట, మార్చి 5 : శివ్వంపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పాపమ్మకు మంజూరైన రూ. 2లక్షల ఎల్‌వోసీని బుధవారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. మాజీ సర్పంచ్ అనూష అశోక్‌గౌడ్ ఉన్నారు.

ప్రమాదంలో తండ్రి మృతి... పరీక్షకు హాజరైన కూతురు

పసుల లింగం (ఫైల్)

వర్గల్, మార్చి 5: రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతిచెందిన విషయం తెలిసిన కూతురు దుఃఖాన్ని దిగమింగుతూ ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు హాజరైంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన పసుల లింగం(50) తూప్రాన్‌కు సొంతపనిపై వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో నాచారం వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే అతడిని గజ్వేల్‌కు చికిత్స కోసం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పసుల లింగానికి భార్య యాదమ్మతో పాటు కుమారుడు సాయికుమార్, కూతురు తేజశ్రీ ఉన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కూతురు తేజశ్రీకి బుధవారం నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఓ పక్కన తండ్రి మృతిచెందాడనే విషాద ఘటన మరోవైపు వార్షిక పరీక్షలు ప్రారంభమవుతుండడంతో గుండెల్లో బాధను దిగమింగుతూ తేజశ్రీ పరీక్షకు హాజరైంది. పరీక్ష ముగిసిన తర్వాత తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నది. డ్రైవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఇంటి పెద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

రైతు ఆశలు ఆవిరి

చిట్కుల్‌లో ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు బోయిని నర్సింహులు

చిలిపిచెడ్, మార్చి 5 : చిలిపిచెడ్ మండలంలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో కొన్నిచోట్ల వరి పొలాలు ఎండిపోతున్నాయి. యాసంగికి మంచి దిగుబడులు సాధిస్తామనుకున్న రైతుల ఆశలు ఆవిరయ్యాయి. చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్ గ్రామానికి చెందిన రైతు బోయిని నర్సింహులు సాగు చేస్తున్న ఆరుఎకరాల వరి పొలానికి బోరు నుంచి సరిపడా నీళ్లురాక ఎండిపోయింది. పెట్టుబడికి పెట్టిన ఖర్చులు రాకపోవడంతో రైతు నర్సింహులు కన్నీటి పర్యంతమయ్యాడు. దీంతో పొలం ఎండిపోవడంతో పశువుల మేతగా మారిపోయింది. ప్రభుత్వం రైతులను ఆదుకొని పంటకు పెట్టిన పెట్టుబడి డబ్బులు ఇవ్వాలని పలువురు రైతులు ఆవేదం వ్యక్తం చేశారు.

తీరిన ట్రాన్స్‌ఫార్మర్ కష్టాలు

బాచారం నారాయణ పొలం వద్ద బిగించిన ట్రాన్స్‌ఫార్మర్

పాపన్నపేట మార్చి 5 : విద్యుత్ నియంత్రణ మండల సలహా సభ్యుడు శశిధర్ రెడ్డి చొరవతో ఓ రైతు 8 నెలల ఎదురుచూపులు ఫలించాయి. మండల పరిధిలోని బాచరం గ్రామానికి చెందిన నారాయణ వ్యవసాయ పొలం కోసం ట్రాన్స్‌ఫార్మర్ అవసరం కావడంతో డీడీ చెల్లించాడు. అయినా విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ బిగించలేదు. దీంతో పంటపొలం ఎండిపోయి నష్టపోయాడు. ఈ విషయం తెలుసుకున్న శశిధర్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన విద్యుత్ నియంత్రణమండలి సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు బుధవారం వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. రైతు నారాయణ మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

శిఖం భూమిలో ఉన్న రోడ్డు తొలిగింపు

రోడ్డును తొలిగిస్తున్న రెవెన్యూ ఆర్ఐ

చిలిపిచెడ్, మార్చి 5 : గ్రామ అధికార పార్టీ నాయకుల అండదండలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు శిఖం భూమిలో నుంచి వేసిన మట్టి రోడ్డును బుధవారం అధికారులు తొలిగించారు. మండలంలోని గంగారం గ్రామ శివారులో రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం కొన్ని రోజుల కింద కొంత మంది అధికార పార్టీ నాయకుల అండతో మట్టి రోడ్డు వేశారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ ఆర్ఐ సునీల్ చౌహాన్, సర్వేయర్ రవిప్రసాద్ శర్మ వెళ్లి శిఖంలో ఉన్న మట్టి రోడ్డు పరిశీలించి, ఆ రోడ్డును జేసీబీ సాయంతో తొలిగించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని ఎక్కడైనా అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు, మట్టి రోడ్లు వేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుటామని హెచ్చరించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

రామాయంపేట, మార్చి 5 : విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ఎస్. ప్రభాకర్, మోటివేషన్ క్లాస్ టీచర్ రమేశ్‌బాబు సూచించారు. బుధవారం రామాయంపేట తెలంగాణ మాడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభను చాటిన విద్యార్థులకు సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. యాచం శంకరయ్యగుప్త, రుక్మిణి, ప్రసన్న, అరుణ పాల్గొన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

కౌడిపల్లి, మార్చి 5 : చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని శేరి తండా గ్రామ పంచాయతీ వసురాం తండాలో చోటుచేసుకుంది. బుధవారం ఎస్సై రంజిత్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లంబాడి శ్రీనివాస్ (32) కొన్ని రోజులుగా తాగుడుకు బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. మంగళవారం భార్యతో గొడవ పడ్డాడు. నేను చనిపోతానంటూ ఇంట్లో నుంచి వెళ్తుండగా, బావ దేవుసింగ్‌కు తెలిపింది. అతను వెంటనే శ్రీనివాస్‌ను వెంబడించాడు. అంతలోనే కన్నారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈత రాకపోవడంతో మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

‘గీత’ కరస్పాండెంట్‌కు గౌరవ డాక్టరేట్

గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న స్కూల్ కరస్పాండెంట్ రామాంజనేయులు

తూప్రాన్, మార్చి 5 : మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని గీతా స్కూల్‌కి జాతీయ స్థాయి అవార్డు కైవసం చేసుకుంది. విద్యారంగంలో తూప్రాన్ పట్టణంలో ‘గీత’ విద్యా సంస్థలు అందిస్తున్న సేవలకు ఈ అవార్డు లభించడం చాలా ఆనందంగా ఉందని గీతా స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు డబ్ల్యూసీఈపీసీ (వరల్డ్ కల్చర్ అండ్ ఎన్వీరాన్‌మెంట్ ప్రొటెక్షన్ కమిషన్) సంస్థ నుంచి ఢిల్లీ తీన్ మూర్తి భవన్‌లో బుధవారం ఈ అవార్డును అందుకున్నారు. పాఠశాల చైర్‌పర్సన్ ఉష, డైరెక్టర్లు రాఘవేందర్ గౌడ్, నారాయణ గుప్తా, ప్రిన్సిపాల్ వెంకట కృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బహిరంగ వేలంలో రూ. 11.72 లక్షల ఆదాయం

కౌడిపల్లి, మార్చి 5 : తునికీ నల్ల పోచమ్మ ఆలయం వద్ద ఆలయ అధికారులు బుధవారం వేలంపాట నిర్వహించారు. ఆలయానికి సంబంధించిన 3 మడిగెలు,1 డబ్బాకు కూచన్‌పల్లి ఈవో శ్రీనివాస్ పర్యవేక్షణలో గ్రామస్తులు, మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు,దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో వేలంపాటకు రూ. 11.72 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో రంగారావు తెలిపారు. ఆలయ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నిజాంపేట, మార్చి 5 : నిజాంపేటకు చెందిన మాసుల బాలయ్య (72)అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మృతుడి అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు స్థానిక నాయకుల ద్వారా పంపించగా, బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నాగరాజు,యూత్ మండలాధ్యక్షుడు మావురం రాజు, మల్లేశం, శివ కుమార్, నర్సింహులు, శ్రీ కాంత్ తదితరులు ఉన్నారు.

మెదక్‌లో..

చేగుంట/మెదక్, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లా చేగుంట మండలంలోని మక్కరాజిపేట్ కాంప్లెక్స్‌లో సీఆర్పీలుగా విధులు నిర్వర్తిస్తున్న రమేశ్ నాయక్, శ్రీనివాస్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ ప్రాంతంలోని వివిధ మండలాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు రూ.2 లక్షల విరాళాలు సేకరించారు. ఈ సేకరించిన ఆర్థిక సయాన్ని రమేశ్, శ్రీనివాస్ పిల్లల పేర్ల మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. దీనికి సంబంధించిన పత్రాలను బుధవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, మెదక్, సిద్దిపేట జిల్లా నాయకులు సంపత్, వెంకటేశం, రాజు, సంతోష్, రమేశ్, యాదగిరి, లచ్చిరం నాయక్, ఎల్లం, కనకయ్య పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న సీఆర్పీలు

ఎలక్ట్రిక్ వీధి దీపాల పంపిణీ

నర్సాపూర్, మార్చి 5 : మండల పరిధిలోని రెడ్డిపల్లిలో మాజీ ఉప సర్పంచ్ అశోక్‌గౌడ్ ఎలక్ట్రిక్ వీధి దీపాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్య ఎదురైనా పరిష్కరిస్తామని వెల్లడించారు. గ్రామస్తులు శేఖర్, రాజయ్య, లక్ష్మణ్‌గౌడ్, ప్రశాంత్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించాలి

నిజాంపేట, మార్చి 5 : చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్)ని వినియోగిస్తూ కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని డీఈవో రాధాకిషన్ ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. బుధవారం నిజాంపేటలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను డీఈవో సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యాంశాల బోధనపై ఆరా తీశారు. ఎంఈవో యాదగిరి ఆయా పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

కనీస వేతనాల డ్రాఫ్ట్ జీవోలను సవరించాలి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 5 : 73వ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాల డ్రాఫ్ట్ జీవోలను సవరిస్తూ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మెదక్ లేబర్ అధికారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మిక సంఘాలు ప్రతిపాదించిన వాటిపై నిర్ణయం తీసుకొని 74 షెడ్యూల్ విడుదల చేయచాలని మల్లేశం డిమాండ్ చేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


ఎరువుల దుకాణాలు తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

మెదక్‌రూరల్, మార్చి 5 : మెదక్ జిల్లాలో యాసంగి సీజన్‌కు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్ కుమార్ అన్నారు. మెదక్‌జిల్లా కేంద్రంలోని ఎరువుల దుకాణాలను బుధవారం వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణాల యజమానులు రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని పేర్కొనారు. అనంతరం ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఏవో శ్రీనివాస్,ఏఈవో రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

రామాయంపేటలో ‘స్వచ్ఛతా ఈసేవ’

రామాయంపేట, మార్చి 5 : చెత్త రహిత రామాయంపేటగా మార్చడమే లక్ష్యమని పేట పురపాలిక కమిషనర్ దేవేందర్, మేనేజర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మెదక్ చౌరస్తా నుంచి అక్కన్నపేట బ్రిడ్జి వరకు చెత్తా చెదారం, రోడ్డు ప్రక్కన ఉన్న గడ్డిని తొలిగింపజేశారు. మున్సిపల్ సిబ్బంది శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోచమ్మల శంకర్, గావు రమేశ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.